# పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- రేపటి నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన కార్యక్రమం
- గ్రామ, వార్డు సభలను కట్టుదిట్టంగా నిర్వహించాలి
- ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు స్వీకరించాలి
- మెదక్ అదనపు కలెక్టర్ రమేశ్


కార్యక్రమంలో మాట్లాడుతున్న మెదక్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెదక్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రమేశ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డుల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు కట్టుదిట్టంగా ప్రజాపాలన సభలు నిర్వహించి ప్రజల నుంచి మహాలక్ష్మి, రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి పథకాలకు సంబంధించిన దరఖాస్తులు పకడ్బందీగా స్వీకరించాలన్నారు. ప్రజలకు పాలన చేరువ చేసేందుకే ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. ప్రతి మండల పరిధిలో తహసీల్దార్, ఎంపీడీవో ఆధ్వర్యంలో రెండు బృందాలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి బృందం రోజుకు రెండు గ్రామాల్లో పర్యటిస్తుందన్నారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు దరఖాస్తుదారులు ముందుగానే దరఖాస్తు నింపుకొని సభకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నిరక్షరాస్యులకు పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు దరఖాస్తు నింపడంలో సహకరించాలన్నారు. ప్రతి పంచాయతీలో, మున్సిపల్ వార్డులో ప్రజాపాలన సభ ఎప్పుడు నిర్వహిస్తున్నామనేది ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రజాపాలన సభ నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం నుంచి దరఖాస్తు ఫారంలు అందిన వెంటనే మండలాలకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రమేశ్ జడ్పీ సీఈఓ శైలేశ్‌ను ఆదేశించారు. దరఖాస్తుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు కంప్యూటర్లో నమోదు చేసి, దరఖాస్తుదారుడికి రసీదు అందించాలన్నారు. సభ నిర్వహణకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించి, భాగస్వామ్యం చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రతి పంచాయతీ, మున్సిపల్ వార్డుల్లో ప్రజాపాలన సభల నిర్వహణకు ఇన్‌చార్జిలను నియమించాలని, సభల్లో ఎన్ని కౌంటర్లు ఏర్పాటు చేయాలి, ఎవరు విధులు నిర్వహించాలని మొదలుకొని ప్రతి అంశం ప్రణాళికాబద్ధంగా జరిగేలా చూడాలని అదనపు కలెక్టర్ రమేశ్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

**సభలపై చాటింపు వేయించాలి... : అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు**

ప్రభుత్వ పథకాలకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించాలని, ముందస్తుగా ఫారం నింపుకొని గ్రామ సభకు వచ్చే విధంగా దరఖాస్తుదారులకు సమాచారమివ్వాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రమేశ్‌తో కలిసి ప్రజాపాలన సభలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామసభల్లో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద క్యూ పాటించేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సభ నిర్వహించే ప్రదేశం, సమయం, వివరాలను ప్రచారం చేయాలని, స్థానిక ప్రజాప్రతినిధులకు ఎంపీడీవో లేదా తహసీల్దార్ ఫోన్ ద్వారా సమాచారం అందజేయాలన్నారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామీణ నీటి సరఫరా శాఖ, పంచాయతీ రాజ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రజాపాలన' పకడ్బందీగా చేపట్టాలి

- ప్రజల మన్ననలు పొందేలా నిర్వహించాలి
- సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేట, డిసెంబర్ 26 : ప్రజల మన్ననలు పొందేలా ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించాలని సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రజాపాలనపై ఆర్డీవోలు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టిన మొదటి కార్యక్రమం ప్రజాపాలన అని, ప్రజలందరూ ఆనందంగా పాల్గొని ప్రభుత్వ గ్యారంటీ పథకాలైన మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తులను అందజేయుటకు అవసరమైన వసతులను కల్పించాలన్నారు. మండలం, మున్సిపల్ స్థాయిల్లో సమన్వయ సమావేశాలు నిర్వహించి ప్రజాప్రతినిధులు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీవో, తహసీల్దార్, పంచాయతీ కార్యాలయాల్లో ప్రజా పాలన కార్యక్రమం షెడ్యూల్‌ను ప్రదర్శించాలని, ఒకరోజు ముందే దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. దరఖాస్తుతో పాటు ఫుడ్ సెక్యూరిటీ, ఆధార్ కార్డును జతపరచాలని సూచించారు. ప్రతి 100 కుటుంబాలకు ఒక కౌంటర్, మహిళలకు ప్రత్యేకంగా కౌంటర్లు, ఇతర దరఖాస్తులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. రోజువారి దరఖాస్తు వివరాలను జిల్లా అధికారులకు అందించాలన్నారు. ప్రతి మండలంలో ఒక ఇంటర్నేషనల్ మోడల్ స్కూల్‌ను నిర్మించేందుకు పది ఎకరాల స్థలాన్ని గుర్తించాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ బుధవారం మధ్యాహ్నం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహణపై సంగారెడ్డిలో నిర్వహించనున్న సమావేశానికి హాజరుకావాలని ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేకాధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, డీఆర్వో నాగరాజమ్మ, పీడీ డీఆర్డీఏ జయదేవ్ ఆర్య, డీపీఓ దేవకీదేవి, జడ్పీ సీఈఓ రమేశ్, ఆర్డీవోలు రమేశ్, బన్సీలాల్, బెన్ శాలెం తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్


దత్తగిరి ఆశ్రమంలో దత్తచండీ హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

# రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

**వైద్యారోగ్య శాఖ మంత్రి దమోదర రాజనర్సింహ**

**దత్త జయంతి వేడుకల్లో ప్రత్యేక పూజలు**

ఝరాసంగం, డిసెంబర్ 26 : దత్తాత్రేయ స్వామి కృపతో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మంగళవారం ఝరాసంగం మండలంలోని బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమంలో నిర్వహించిన దత్త జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతులు అవధూతగిరి మహరాజ్, డాక్టర్ సిద్దేశ్వర స్వామిజీలు ఆయనకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆశ్రమంలో నిర్వహిస్తున్న జ్యోతిర్లింగాల అభిషేకం, దత్తచండీ హోమం పూర్ణాహుతిలో పాల్గొనడంతో పాటు ఆశ్రమంలోని పలు ఆలయాల్లో మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ దైవ సంకల్పంతో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నారు. దత్తాత్రేయ స్వామి జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవదాస్, పార్టీ మండల అధ్యక్షుడు హనుమంత రావు పాటిల్, సంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్‌శంకర్, జహీరాబాద్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నరేశ్‌గౌడ్, నాయకులు ప్రవీణ్ పటేల్, అన్వర్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రెండో రోజూ క్రిస్మస్ సందడి

◆ మెదక్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు ◆ భక్తులను ఆశీర్వదించిన మత పెద్దలు ◆ మొక్కులు తీర్చుకున్న భక్తులు.. ◆ చెట్ల కిందే వంటావార్పు

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 26 : రెండో రోజూ మెదక్ చర్చిలో క్రిస్మస్ సందడి నెలకొన్నది. పండుగ సందర్భంగా సోమవారం వచ్చిన భక్తులు మంగళవారం తిరిగి వెళ్తుండగా, మరోపక్క ఏసయ్య సన్నిధికి వేలాది మంది భక్తులు విచ్చేసి ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య, చర్చి పెద్దలు డేవిడ్, శ్రీనివాస్, జైపాల్ సువర్ణలు భక్తులను ఆశీర్వదించారు. కొంతమంది భక్తులకు చర్చిలోని వసతి గృహాలు, కాటేజీలు లభించకపోవడంతో చెట్ల కిందే వంటావార్పు చేసుకున్నారు.

**రంగుల రాట్నం వద్ద కోలాహలం..**

చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన రంగుల రాట్నాలు, వివిధ ప్రదర్శనలు చిన్నారులు, యువతను ఆకర్షిస్తున్నాయి. సాయంత్రం వేళలో వీటికి డిమాండ్ పెరిగింది. ఆటవస్తువులు, బొమ్మల దుకాణాలు కళకళలాడుతున్నాయి. మెదక్ డీఎస్పీ ఫణీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కాకుండా పార్కింగ్ జోన్ ఏర్పాటు చేసి వాహనాలను అక్కడే నిలిపివేయించారు.

**'బాక్సింగ్ డే' కేక్ కట్ చేసిన చర్చి కమిటీ సభ్యులు**

బాక్సింగ్ డే పురస్కరించుకొని చర్చి ప్రాంగణంలో చర్చి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బాక్సింగ్ డే కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, శాంసన్ సందీప్, సువన్ డగ్లస్, గెలెన్ చిత్తరంజన్, జాన్సన్, వికాస్, నోబుల్‌సన్, దేవప్రకాశ్, జోసెఫ్, శాంతికుమార్, సుశీల్‌కుమార్, పాస్టర్ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.


చర్చి వద్ద భక్తుల సందడి


బాక్సింగ్ డే కేక్ కట్ చేస్తున్న చర్చి కమిటీ సభ్యులు


చర్చి ప్రాంగణంలో శిలువ వద్ద కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు